

యువకులను క్రీడల్లో ప్రోత్సహించండి



మంత్రి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలని, వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలని యువజన క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులకు క్రీడా రంగాల్లో శిక్షణ ఇప్పించాలని, క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. రామగుండం నియోజకవర్గంలో పశువుల సంరక్షణ, మత్స్యకారులను ప్రోత్సహించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మహంకాళి స్వామి ఉన్నారు.

రైతులకు చేరువలో రైతు నేస్తం

- జిల్లాలో మరో 24 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు
- వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు
- అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలు మరి కొందరు రైతులకు చేరువకానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 54 రైతువేదికలను నిర్మించారు. ప్రతి ఐదు వేల ఎకరాలకు కలిపి ఒక రైతువేదికను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మూడు నుంచి ఐదు గ్రామాల రైతులు ఉంటారు. వారందరికీ పంటల సాగు గురించి శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఉపయోగ పడనున్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో గల వ్యవసాయ విస్తీర్ణాధికారులకు రైతువేదికల బాధ్యతలను అప్పగించారు.

గతంలో రైతువేదికలను కేవలం కార్యాలయాలుగానే ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం వాటిలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది మాసాల క్రితం మొదటి, రెండో విడతల్లో గుండారం, కాట్నపల్లి, ఎక్లాస్‌పూర్ రామవాపూర్, ఎలిగేడు, తేలికుంట, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, బొట్ల వనపర్తి, మేడిపల్లి, బ్రాహ్మణపల్లి, రత్నాపూర్, ముత్తారం, గుంజపడుగు గ్రామాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఏర్పాటు చేశారు. తాజాగా ధర్మారం, కటికె నపల్లి, లింగాల, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్, మైదం బండ, ఖమ్మంపల్లి, ఆదివారంపేట, సుందిళ్ల, ధూళికట్ట, సుల్తాన్‌పూర్, వడుకాపూర్, అబ్బాపూర్, పొత్కపల్లి, గుండ్లపల్లి, బ్రాహ్మణపల్లి, కొత్తపల్లి, కిష్టంపేట్, కూనారం, కనుకుల, అల్లీపూర్, సోమన్‌పల్లి, పుట్నూర్, కుక్కల గూడూర్‌లోని మరో 24 రైతు వేదికల్లో వీడియో కాన్ఫ రెన్స్ పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 38 రైతువేదికల్లో ఏర్పాటయ్యాయి. ఇంకా మిగిలిన 16 రైతు వేదికల్లో కూడా నాల్గవ విడతలో ఏర్పాటు చేయనున్నా రని అధికారులు చెబుతున్నారు. వాటిని సోమవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి ఆరంభించారు. రైతులను ఉద్దేశించి ప్రసం గించారు.

- తక్కువ ఖర్చు.. అధిక దిగుబడే లక్ష్యం..

రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశెనగ, తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగబడులు సాధించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు సంబంధించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవ సాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆయా రైతు వేదికల పరిధిలో ఉన్న

(మిగతా 8వ పేజీలో)

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



సమీక్షా సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. హెల్త్ సెంటర్ల మరమ్మతు పనులు, సబ్ సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మతు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల, హాస్టళ్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుంటూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన తహసీల్దార్ భవన నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, ఆ దిశగా పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, సిపిఓ రవీందర్, ఏవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో నాలుగు గ్రామాల విలీనం : కలెక్టర్

కోల్‌సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో 60 డివిజన్లుగా పునర్విభజన చేసినట్టు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో రామగుండం నగర పాలక సంస్థలో 50డివిజన్లు ఉండేవని, లింగాపూర్, వెంకట్రావ్‌పల్లి, ఎల్కలపల్లిగేట్, అక్బర్‌నగర్ గ్రామాలను విలీనం చేయడంతో 60డివిజన్లుగా పునర్విభజన చేయాలని సీడీఎంఏ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 60డివిజన్లుగా రామగుండం నగరపాలక సంస్థను పునర్విభజన డ్రాఫ్టును కలెక్టర్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీహరి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్, రెవెన్యూ అధికారి అంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



నిట్టూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోమవారం నిట్టూరు, తుర్కలమద్దికుంట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, ఇళ్లకు ముగ్గుపోసే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతోపాటు పెద్దపల్లి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేశామని, అదనంగా 1000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లు మార్చకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వసతులు కల్పించి అందించామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఎంపీవో శరత్‌బాబు, మల్లయ్య, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి, రాజేందర్, నాయకులు నరేష్, ఎడెల్లి శంకర్, ప్రదీప్, సంపత్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతోపాటు, మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. తుర్కలమద్దికుంట ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. అనంతరం పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మంజులత, సీఆర్‌పీ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భూ భారతి ద్వారా పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి ద్వారా రైతుల భూములు ఆన్‌లైన్ కానరాకుండా పోయాయని, భూ భారతి ద్వారా ప్రతీ ఒక్కరి భూమిని ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించే విధంగా తీసుకొచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి, డీసీహెచ్ శ్రీధర్‌లు ర్యాలీని ప్రారంభించారు. అయ్యప్ప టెంపుల్ నుంచి కమాన్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. యోగా వల్ల కలిగే ఆరోగ్యంపై వివరించారు. ప్రతీ ఒక్కరు యోగా చేయాలని సూచించారు. ఆయూష్ జిల్లా ఇన్‌చార్జీ అరుణ. ప్రోగ్రాం మేనేజర్ విద్యాసాగర్, డాక్టర్ ప్రభాకర్, శ్రీకాంత్, కేశిరెడ్డి, జోత్స్న, పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన సెట్టి సురేష్ జిల్లా పరిధిలో ఎన్ని కబేళాలకు అనుమతులు ఉన్నాయో వివరాలు తెలుపాలని దరఖాస్తు చేశారు. పెద్దకాల్వల గ్రామానికి చెందిన బొంగు రాజమ్మ భర్త మల్లయ్యకు బోదకాలు ఉన్నందున దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా డీఆర్‌డీఏ పీడీకి రాశారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన పాలకుర్తి లక్ష్మి గ్రామ శివారు సర్వే నెంబర్ 645లో తమ కుటుంబానికి చెందిన భూములను కుమారునికి తెలియకుండా రెండో కోడలు రజిత పహాణీలో పట్టాదారుగా నమోదు చేసుకుందని, చర్యలు తీసుకొని తమ భూమి తమకు ఇప్పించాలని దరఖాస్తు చేసుకొంది.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

కళ్యాణ్‌నగర్,(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బరిగెల ప్రసన్నకుమార్ అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మూడు సంవత్సరాలనుంచి అరకొర నిధులు విడుదల చేయడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బడ్జెట్ రాక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వద్ద అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు తల్లిదండ్రులు రోడ్డుపైకి వచ్చేటప్పుడు హెల్మెట్ ధరించాలని చెప్పాలని, విద్యార్థులు తమ పాఠశాలల్లో తోటి విద్యార్థులకు కూడా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పూలను అందజేశారు. ఒక్క రోజు ట్రాఫిక్ విధులు నిర్వహించడం ఆనందంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్‌తోపాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి కలుషితం కాకుండా చూడాలి



గోదావరి నదిలో చెత్త ఏరివేసిన కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరిని కలుషితం కాకుండా చూడాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గోదావరి నది వద్ద పుష్కర ఘాట్ లోని ప్లాస్టిక్ బాటిళ్లు, క్యారీ బ్యాగులు, చెత్తను ఏరి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనంత కోటి జీవరాశులకు ప్రమాదం ఉందని, గోదావరిలో పుణ్య స్నానం ఆచరించే భక్తులు ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తను వేయరాదని, గోదావరి నదిని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా టీఎంసీ మౌనిక, వార్డు అధికారులు, సీఓ, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఓదెల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా కేసులు నమోదు చేయించి, ఏసీబీ నోటీసులను జారీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఫార్ములా - ఈ రేస్‌లో ఎలాంటి అక్రమాలు, అవినీతికి చోటు లేకున్నా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చి విచారించడం చట్ట వ్యతిరేక చర్యలన్నారు. ఎన్ని కల్లో ఇచ్చిన అరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మ్యాడగోని శ్రీకాంత్, చర్లపల్లి సురేష్, మద్దెల శ్రీనివాస్, బొంగోని వెంకటేష్, పోలోజు రమేష్, బోడకుంట నరేష్, గడ్డం శ్యాం, కొండ్ర రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

అరుణోదయ కళా సంఘం గౌరవ అధ్యక్షురాలు విమలక్క



7

రక్తదాతలను అభినందించిన కలెక్టర్

8

జీడీకే 7ఎల్ఈపీ మృతులకు నివాళి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జీడీకే 7ఎల్ఈపీ ప్రమాదంలో మరణించిన కార్మికులకు కార్మికసంఘాల నాయకులు నివాళులర్పించారు. సోమవారం గని సమీపంలోని మృతుల స్థూపం వద్ద ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. మృతుల స్థూపానికి పూలమాలలు వేసి మరణించిన కార్మికుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. 7ఎల్ఈపీ ప్రమాదం సింగరేణిలో అతి పెద్ద ప్రమాదమని, గనిలో నీటి ప్రవాహం చేరడంతో 17 మంది కార్మికులు మృతి చెందినట్టు కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. 19 ఏళ్ళు గడిచినా ఈ ప్రమాదాన్ని కార్మికవర్గం మరువలేదని, రక్షణలో నిర్లక్ష్యం కారణంగానే 7ఎల్ఈపీ ప్రమాదం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. వివిధ యూనియన్ల నాయకులు జనక్‌ప్రసాద్, నర్సింహారెడ్డి, ధర్మపురి, రాజారెడ్డి, జిగురు రవీందర్, వికాస్‌కుమార్, సదానందం, శంకర్‌నాయక్, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ, ప్యారెమియ, దశరథం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల పనులు ప్రారంభం

- ఏడాదిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

కళ్యాణ్‌నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాం తంలో సింగరేణి మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నారు. సేక్రెడ్‌హార్ట్ పాఠశాల పక్కన 5ఎకరాల స్థలంలో రూ.26కోట్లతో పక్కా భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం శారదానగర్‌లోని సింగరేణి భవనంలో నర్సింగ్ కళాశాల కొనసాగుతుంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ నర్సింగ్ కళాశాల నిర్మించాలంటూ గతేడాది ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడంతో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి నవంబర్ 21న జీవో నెం.183ను జారీ చేసింది. 60 సీట్లతో నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో పది రోజులుగా పనులు వేగవంతం చేశారు. అన్ని హంగులతో నిర్మిస్తున్న ఈ కళాశాల నిర్మాణంతో పాటు సామగ్రిని కొనుగోలు చేసేందుకు రూ.26కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. స్థలం లేక ఆరు నెలలుగా పనులు కొనసాగలేదు. సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ పక్కన 5ఎకరాల స్థలంలో ఈ కళాశాలను నిర్మిస్తున్నారు. గత నెల 23న నర్సింగ్ కళాశాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష నిర్మాణ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు సెప్టెంబర్‌లో పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి వెళ్లనున్నారు.మరో బ్యాచ్ అడ్మిషన్లు సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ప్రారంభం కానున్నాయి. నాలుగు సంవత్సరాల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసే విద్యార్థులకు హాస్టల్ భవనం, క్లాస్‌రూములు హంగులతోనిర్మాణం చేపట్టనున్నారు.



సేక్రెడ్‌హార్ట్ పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల బోర్డు



నర్సింగ్ కళాశాల భవనం నిర్మించనున్న స్థలం

మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

-మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం



రామ గుండాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకున్నా. నర్సింగ్ కళాశాల కోసం రూ.26 కోట్లు మంజూరు చేయించాను. 142కోట్లతో ఖని జనరల్ ఆసుపత్రిలో ఐదు అంతస్థుల భవన నిర్మాణం ఈ ఏడాదిలో పూర్తయి 762 పడకలు అందుబాటులోకి రానున్నాయి. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.20 కోట్లతో క్యాత్‌ల్యాబ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక నుంచి గుండె వ్యాధుల చికిత్స కోసం ఇక్కడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నాం. మరో డెంటల్ కళాశాల అనుమతి కోసం ఢిల్లీలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ వద్ద ఫైల్ ఉంది. త్వరలోనే రామగుండానికి డెంటల్ కళాశాల వస్తుంది.



పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ గ్రామంలో తేజస్విని(26) అనేవివాహిత సంతానం కావడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలజిల్లా జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కోడిపెల్లి లక్ష్మి-కిషన్‌ల కూతురు తేజస్విని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన జెల్ల సతీష్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. అప్పుడప్పుడు తేజస్విని తనకు పెళ్లై 5సంవత్సరాలు అవుతున్నా సంతానం కావడం లేదని బంధువులకు చెబుతూ బాధపడేది. పిల్లలు పట్టడం లేదని మనోవేదనకు గురై ఈనెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తేజస్వినిని జమ్మికుంటలోని ఓప్రైయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేపించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తల్లి కోడిపెల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి మీదకు వచ్చి ఇష్టం వచ్చినట్లు దూషించడంతో అవమానభారంతో మందు గోళీలు వేసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీకి చెందిన పకిడే రవి అనేవ్యక్తి సల్ల రాజమ్మ దగ్గర అవసరం నిమిత్తం రూ.70వేలు అప్పుగా తీసుకున్నాడు. రాజమ్మ భర్త సమ్మయ్య సోమవారం అప్పుతీసుకున్న రవి ఇంటిమీదకు వచ్చి డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ నానా బూతులు తిట్టాడు. పరువు పోయిందని భావించిన రవి భార్య కవిత ఇంట్లో ఉన్న మందు గోళీలు(టాబ్లెట్స్) అన్ని ఒకేసారి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అగ్గ ఆశన్న(59) అనేవ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. ఆశన్నకు సంతానం లేకపోవడంతో పాటు భార్య మల్లుతో కుటుంబ కలహాలు రావడంతో కొంతకాలంగా ఆమె రాయికల్‌లో తల్లి గారి ఇంట్లో ఉంటోంది. దీంతో ఆశన్న మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్జాలో కరీంనగర్‌వాసి మృతి


ఖాజా మెహరాజ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఖాజా మెహరాజ్(46) ఆదివారం రాత్రి షార్జాలో మృతి చెందాడు. ఖాజా ఎనిమిదేళ్లుగా షార్జాలో అల్‌ఖైరిన్‌బాయ్స్‌పాఠశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కరీంనగర్ నుంచి ఆయన కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో అక్కడేఉన్న వారిబంధువులకు సమాచారం అందించారు. బంధువులు ఆయన గదికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మెహరాజ్‌కు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని సోమవారం సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సీఐ మాట్లాడుతూ ఈనెల15నసాయంత్రం 5గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామఎక్స్‌రోడ్డు వద్ద ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. ఆసమయంలో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపునకు వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారివద్ద ఉన్న బ్యాగులో 5కిలోల గంజాయి లభించింది. గంజాయితో దొరికిన నిందితులలో వేములవాడ మండలం, నాగయ్యపల్లి గ్రామానికి చెందిన గొంటి నగేష్(19), కోనరావుపేట మండలం, మట్టిమల్ల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్(19), వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన కుత్తడి భరత్(19) ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ఒడిస్సా నుంచి గంజాయి: గంజాయి తాగడానికి బానిసై పోలీసులకు దొరికిన ముగ్గురు జల్సాలకు అలవాటు పడ్డారు. గంజాయి కొనుగోలు చేసి అనంతరం ఎక్కువ ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకొని నాలుగు రోజుల క్రితం బైక్‌పై ఒరిస్సాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారన్నారు.



ఇంటింటికీ ఇంటర్నెట్ ఇంకెప్పుడు?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

భగత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇంటర్‌నెట్ సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన టీ-ఫైబర్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గ్రామాల్లో సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతో పాటు, ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. 2015 సంవత్సరంలో ప్రారంభమైన పనులు 2022 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాతాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంలేదు.


ఇంటర్‌నెట్ కోసం కొత్తపల్లి మండలంలో వేసిన పైపులైన్

పైప్‌లైన్‌తోనే సరి...

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 313 గ్రామ పంచాయతీలు ఉండగా, గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీ ఎస్, విద్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు ఒక జీబీపీ ఎస్ కనీస వేగంతో బ్రాడ్ బ్యాండ్ సేవలను తక్కువ ధరలకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్‌నెట్‌లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ మిషన్ భగీరథ పైపులైన్‌తోపాటు అండర్ గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టికల్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణ పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలను అనుసంధానం చేశారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సోలార్ ఇన్వర్టర్లు ఏర్పాటు చేశారు. పెండింగ్ పనులను నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఇంటర్‌నెట్ కనెక్షన్లు అందుబాటులోకి రావడం లేదు. విస్తృత ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

మాన్యువల్‌గానే పనులు

గ్రామ పంచాయతీల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంతో ఇప్పటికీ కార్యకలాపాలు మాన్యువల్‌గానే సాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైనా సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వివిధ అనుమతి పత్రాలు, లైసెన్స్ రసీదులు ఏదీ కావాలన్న కాగితంపై రాసి ఇస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ ఫైళ్ల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన చెక్కులు, జీతాల రసీదులు ఇలాంటి పనులన్నీ మాన్యువల్‌గానే చేస్తున్నారు. ప్రతి నెల ఆదాయ వ్యయాలను ఆన్‌లైన్ అడిట్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పనులన్నింటికి ఇంటర్‌నెట్ అవసరం ఉంటుంది.

టీ-ఫైబర్ ప్రారంభిస్తే అందుబాటులోకి ఎన్నో సేవలు

గ్రామీణప్రాంతాల్లో టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తే ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామాల్లో రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బందికి ఆన్‌లైన్‌లో పలు విషయాలు అప్‌లోడ్ చేస్తుంటారు. టీ- ఫైబర్ పనిచేయడం ప్రారంభమైతే ఈ బ్యాంకింగ్, ఈ గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి మెడిసిన్ వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ క్లాస్ లాంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

పనులు వెంటనే పూర్తి చేయాలి: కడారి రతన్‌కుమార్, ఎలగందల్



ప్రస్తుత కాలంలో ప్రతి విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉన్నది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

మహిళపై దాడి

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న కాశపల్లిలో సోమవారం ఓ మహిళపై దాడి జరిగింది. కాశపల్లిలో కొందరు గొడవ పడుతుండగా ఫాతిమా అనే మహిళ అడ్డుకోవడంతో అందులో ఒకరు ఆమెను కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయమైంది. ప్రస్తుతం ఆమెపరిస్థితి విషమంగా ఉంది. సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకురాగా వరంగల్ ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు గాయపడ్డ మహిళను కరీంనగర్ తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

- 9మందికి జరిమానా

కోల్‌సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంసేవించి వాహనాలు నడిపిన ఉప్పల నరేష్, ఆనంపల్లి నగేష్‌లకు మూడు రోజుల జైలు శిక్షను రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 9మందికి రూ.14వేల జరిమానా విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కారు, బైక్ ఢీ

ముత్తారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, బగుళ్ల పుణ్యస్నానానికి వెళ్లేదారిలో పోతారం చెందిన కట్ల పవన్ ద్విచక్రవాహనానికి కారు ఢీకొట్టడంతో పవన్‌కు తల, ఛాతిభాగంలో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పవన్‌ను చికిత్సనిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పై కప్పు తొలగించిన మనవడు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

శంకరపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో ఇంటి పైకప్పును మనవడు తొలగించాడని వృద్ధజంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కొమురమ్మ-కనకయ్యలకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు గణేష్ చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా కొమురమ్మ-కనకయ్య రాజాపూర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న కొమురమ్మ-కనకయ్యకు తోడుండాల్సిన మనవడు అదేం పట్టకుండా వీరిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 10న మనవడు ఉదయ్, పెద్దకోడలు లక్ష్మి కలిసి ఇంటిపై కప్పును తొలగించి, ఇంటి గోడను కూడా కూల్చివేసినట్లు తెలిపారు. దీంతో వారు కేశవపట్నం పోలీసులను ఆశ్రయించారు. వృద్ధదంపతులకు ఆసరాగా ఉండి చేరదీయాల్సిన పెద్దకోడలు, మనవడు ఉండేందుకు గూడు లేకుండా ఇంటి పైకప్పుతొలగించి గోడలు కూల్చి వేయడంతో గ్రామంలో చుట్టుపక్కల వారి ఇళ్లలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడిందని గోడు వెళ్లబోసుకున్నారు. కాగాబ్లూకోర్టు పోలీసులు రాజాపూర్ గ్రామానికి చేరుకొని ఇంటిపైకప్పు తొలగించి గోడలు కూల్చివేసిన ఘటనపై వివరాలు సేకరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో ఓఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా, స్వామి, అమీర్, శంకర్, రాజు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. వారినుంచి రూ.8,200నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండుబైకులు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

హత్యాయత్నం కేసులో తొమ్మిది మంది రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో భూ వివాదంలో కొలకాని పరుశరాములు, అతని కుటుంబ సభ్యులపై ఈ నెల 14న హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో ప్రధాన నిందితుడైన కొలకాని శ్రీనివాస్‌తో సహా 9మందిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ వివరాల ప్రకారం... పట్టణంలోని చంద్రంపేట గ్రామంలో కొలకాని అంజయ్య, అతని సోదరుడి కుమారులైన కొలకాని శ్రీనివాస్, నాగరాజుల మధ్య గత కొన్ని రోజుల నుంచి ఇంటి స్థలం వివాదం నెలకొంది. దీంతో నాగరాజు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలాన్ని జేసీబీతో చదును చేయడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న శ్రీనివాస్, నాగరాజులు మరికొంత మందితో కలిసి అంజయ్య కుటుంబాన్ని చంపితే భూమి తమ వాళ్లకే చెందుతుందని పథకం పన్నారు. ఈ పథకం ప్రకారం అంజయ్య కుటుంబ సభ్యులను శ్రీనివాస్, నాగరాజు, మంగ, మమత, ఎల్లవ్వలు కలిసి బూతు మాటలు తిడుతూ వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన వేముల పెద్దభూమయ్య, అతని కుమారులు నాగరాజు, ప్రశాంత్‌లు కలిసి పర్శరాము లును దొరకబట్టడంతో వెంటనే అతనిపై శ్రీనివాస్ కత్తితో దాడిచేసి పొడిచాడు. పర్శరాములు తండ్రి అంజయ్య, తల్లి లచ్చవ్వను బండరాయితో దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రధాన నిందితుడైన శ్రీనివాస్ ఓ న్యాయవాది ద్వారా కోర్టులో సరెండర్ అయ్యాడు. సరెండర్ అయిన శ్రీనివాస్‌తో పాటు చంద్రంపేటకు చెందిన కొలకాని నాగరాజు, కొలకాని మంగవ్వ, కొలకాని మమత, కొలకాని ఎల్లవ్వ, వేములవాడ అర్బన్ మండలంలోని వేముల పెద్ద భూమయ్య, వేముల నాగరాజు, వేముల ప్రశాంత్, వేముల మల్లేశంలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై మహిళల ఆందోళన

ధర్మపురి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్దనక్కలపేట గ్రామపంచాయితీ ఎదుట సోమవారం పలువురు మహిళలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల మంజూరు పత్రాల్లో పలువురు అర్హులకు చోటు దక్కలేదని వాపోయారు. అనర్హులకు ఇళ్లు కేటాయించి తమకు అన్యాయం చేశారని మహిళలు ఆరోపించారు. కిరాయి ఉంటున్న వారిని, వితంతువులకు, దారిద్ర్యరేఖకు దిగువఉన్న వారికి ముందుగా ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మొదటి లిస్ట్‌లో లబ్ధిదారులుగా తమ పేరు వచ్చిందని, దీంతో తాము పాత ఇళ్లను కూల్చి వేసుకున్నా మని పలువురు మహిళలు తెలిపారు.

కానీ ప్రస్తుతం లిస్ట్‌లో పేరు లేదని, ఉన్న ఇళ్లు పోగొట్టుకున్నామని ఆకుల అనిల్ అనే వ్యక్తి ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మహిళలు డిమాండ్ చేశారు.


గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

పురుగుల మందు డబ్బాలతో ప్రజావాణికి రైతులు

- చెరువు భూమిని కాపాడాలని డిమాండ్



జగిత్యాల కలెక్టరేట్‌కు పురుగుల మందు డబ్బాలతో వచ్చిన కొండాపూర్ గ్రామరైతులు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామ శివారులోని బూరుగుకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని, మరమ్మతు చేయించాలని రైతులు సోమవారం జగిత్యాల కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణికి క్రిమిసంహారక మందు డబ్బాలతో వచ్చి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు సంబంధిత రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాలను లాక్కున్నారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. చెరువు ప్రాంతంలో ఇటీవల భూమికొనుగోలు చేసిన సబ్బనవేణి అంజయ్య అనే వ్యక్తి చెరువు మత్తడిని, చెరువు కట్టను ధ్వంసం చేశాడని రైతులు ఆరోపించారు. చెరువులో నీరు నిలవకుండా చేసి శిఖం భూమిని సాగు చేస్తున్నాడని, దీని వల్ల చెరువు కింద ఉన్న తమ భూముల గుండా నీరు ప్రవహించి తమ పంట కొట్టుకు పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు తహసీల్దార్‌కు, పోలీసు లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న తమ భూమి పనికి రాకుండా చేస్తున్నాడని రేగుల దేవమ్మ అనే వృద్ధురాలు రోదించింది. తమ సమస్యకు పరిష్కారం లభించకుంటే పురుగులమందు తాగుతా మని రైతులు హెచ్చరించారు. దీంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

బస్సులు ఆపడం లేదని మహిళల ఆందోళన

కథలాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాల స్టేజీ వద్ద ఆర్టీసీబస్సులు ఆపడం లేదని మహిళలు సోమవారం ఆర్టీసీ బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాండ్ర్యాల స్టేజి వద్ద ఆర్టీసీబస్సులు ఆపకపోవడంతో కోరుట్ల, కథలాపూర్ ప్రాంతాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై గతంలో కోరుట్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించినా కనీస స్పందన లేదనివారు విమర్శించారు. మహిళలు అరగంటసేపు బస్సులను నిలిపివేయడంతో డిపోమేనేజర్ మహిళలతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు తాండ్ర్యాలస్టేజీ నిలిపేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు.


తాండ్ర్యాలలో ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లి చోరీకేసులో మరో నిందితుడిని పట్టుకుని, మూడు తులాల బంగారం రికవరీచేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. సోమవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో చోరీలో మూడవ నిందితుడు చందుర్తి మండలంకు చెందిన పిట్టల అరవింద్‌ను అరెస్టు చేసి విలేకరులతో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం ఈనెల 8న మండలంలోని వెంకటయ్యపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 33 తులాల బంగారం నగదు, వెండి ఎత్తుకెళ్లిన్నట్లు తెలిపారు. ఈ చోరీ కేసులో ఈనెల 13న ఇద్దరు నిందితులను పట్టుకుని 20తులాల బంగారం రికవరీ చేయగా సోమవారం మూడో నిందితుడిని పట్టుకుని మరో మూడు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులున్నాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్సై వంశీక్రిష్ణ, గంగాధర పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముప్పిడితోట గ్రామానికిచెందిన యువతి చెవుల సౌమ్య(25) జమ్మికుంటలోని తమ సమీప బంధువుల ఇంట్లో మూడు నెలలుగా ఉంటోంది. ఈనెల 14న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదు. ఈమేరకు ఆమె సోదరుడు సాయిచరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 10 మందికి స్వల్ప గాయాలు

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు లారీని ఢీకొనడంతో సోమవారం 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీనీ ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణం చేస్తున్న శివకుమార్, సుజాత, గంగనర్సు, పద్మ, వనిత, లక్ష్మి, కల్పన, ఉష్మా, మంజుల అనే ప్రయాణికులతోపాటు బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను స్థానికప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ సమీపాన మానేరు కెనాల్ వద్ద జరిగిన మెండే సతీష్ హత్యకేసును పోలీస్‌లు ఎట్టకేలకు ఛేదించారు. ఈనెల13న లింగన్నపేటకు చెందిన మెండే సతీష్‌ను బీరు సీసాలతో దాడిచేసి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం మూడు రోజులుగా పోలీస్‌లు తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు నిందితులను పోలీస్‌లు పట్టుకుని సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరళించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానికఎస్ఐ ప్రేమానందం తెలిపినవివరాల ప్రకారం.. మృతుడు మెండే సతీష్, అదే గ్రామానికి చెందిన నిందితులైన నర్మాల పవన్ కుమార్, భీమయ్యగారి రాజశేఖర్‌లు సుతారి పనికి వెళ్లేవారు. ఈ క్రమంలో మృతుడు సతీష్ తన అవసరాలకు భీమయ్యగారి రాజశేఖర్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు డబ్బుల కోసం ముగ్గురి మధ్య గొడవలు జరిగేవి. ఈనెల13న మానేరుకెనాల్ వద్ద నిందితుడైన పవన్ కుమార్, మృతుడు సతీష్ దావత్ చేసుకున్నారు. ఇదే క్రమంలో పవన్ కుమార్‌ను వారి సమీప బంధువులను సతీష్ అసభ్యకరంగా దూషించాడు. ఇదే విషయాన్ని రాజశేఖర్‌కు ఫోన్‌లో పవన్ చెప్పాడు. సతీష్‌ను చంపేద్దామని మనం అనుకున్నాం కదా.. ఇదే మంచి సమయం చంపేయంటూ ఫోన్‌లో రాజశేఖర్ పవన్‌కు చెప్పడంతో బీరు సీసాలతో తలపై, మెడపై సతీష్‌ను పవన్ కొట్టిచంపేశాడు. సతీష్‌ను హత్య చేసిన పవన్‌ను, హత్యకు ప్రోత్సహించిన రాజశేఖర్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరళించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యకు సంబంధించిన నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన స్థానిక ఎస్ఐ ప్రేమా నందం, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా అభినందించారు.





మైమరపించే ప్రకృతి అందాలు

షూటింగ్, పిక్నిక్ స్పాట్‌గా బతుకమ్మ కుంట ప్రాంతం

ఇటీవల కురిసిన వర్షాలతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంది.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రం సమీపంలోని బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు ఎటు చూసినా పచ్చదనంతో మైమరపింపజేస్తున్నాయి. జగిత్యాల-కమ్మునూరు రోడ్డుకు రెండు వైపులా పచ్చని టేకు చెట్లతో వాహనదారులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు షూటింగ్‌లకు అనుకూలంగా ఉంది. ఈ ప్రాంతంలో ఫోక్ సాంగ్స్, షార్ట్‌ఫిలింల చిత్రీకరణ జరుగుతుంటుంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ ఈ ప్రాంతంలో జరుపుతుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో పలువురు పర్యాటకులు ఇక్కడికి పిక్నిక్‌కు వస్తుంటారు. మధ్యలో కుంట, చుట్టు పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - సారంగాపూర్, ఆంధ్రజ్యోతి

పోలీసు ఉద్యోగం..

సమాజ సేవకు లభించిన అవకాశం

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



పీటీసీలో మొక్క నాటుతున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉద్యోగానికి ఎంపికవడం సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గతంలో వెలువడిన పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఎంపికై వివిధ కారణాలతో హాజరుకాని 91 మందికి కరీంనగర్ పీటీసీలో సోమవారం శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ పోలీసుశాఖ మొదటి స్థానంలో నిలిచిందని, తొమ్మిది నెలల పాటు అందించే శిక్షణను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధి నిర్వహణలో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించిన సీపీ పీటీసీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కాలేజ్(పీటీసీ) ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ మోహన్(డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేష్‌బాబు, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి, గంగాధర్, శివరామయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- వేములవాడలో రోడ్ల విస్తరణతో సుదీర్ఘ నిరీక్షణకు తెర
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగిన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా ఇళ్లను కూల్చివేసే కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టే క్రమంలో రోడ్ల వెడల్పు పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు అవసరమైన పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గత నవంబరు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 8 మంది మంత్రుల సమక్షంలో 76 కోట్లతో ఆలయ విస్తరణ, 47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, 35 కోట్లతో అన్నదాన సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధితో పాటు, వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 కోట్లు, 25-26 బడ్జెట్లో 100 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని గత 30 ఏళ్లుగా స్థానికులు కోరుకుంటున్నారని, గత ప్రభుత్వంలోగా కేవలం మాటలకు శంకుస్థాపనలకు పరిమితం



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కాకుండా అభివృద్ధిని ఆచరణలో చూపిస్తూ రోడ్ల వెడల్పు పనులు ప్రారంభించామని అన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని నాలుగు ఎకరాలలో విస్తరించేందుకు ఇప్పటి వరకు నాలుగు సార్లు శృంగేరి పీఠాధిపతి వద్దకు వెళ్లి వారి సలహాలు సూచనలు స్వీకరించి, వాటి ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని, శ్రీ స్వామివారి శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజన్న ఆలయం మెట్లమీద ఇచ్చిన హామీని తప్పాడని, తన పెళ్లి ఇక్కడే అయ్యిందని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే 100 కోట్ల రూపాయలు విడుదల చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పటి వరకు అలాగే ఉందని, రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధిని చూపించారని ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు అమలవుతున్నాయన్నారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని, అయినప్పటికీ రోడ్ల వెడల్పు కోసం భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువబోమన్నారు. మెయిన్ రోడ్‌లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని, పట్టణ ప్రజలకు, యాత్రికులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు మంత్రి పదవులు

- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనకు గడ్డం వివేక్‌కు, వాకిటి శ్రీహరిలకు ఒకే రోజు మంత్రి పదవులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో విలేకర్లతో మాట్లాడారు. మా ఇంటి ఇలవేల్పు, కుల దైవం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారన్నారు. అమ్మవారి దర్శనం అనంతరమే ఏ కార్యక్రమైనా మొదలు పెడుతామని చెప్పారు. 1984 నుంచి ఎన్‌ఎస్‌యూఐ నుంచి మొదలుకొని నేటి వరకు కాంగ్రెస్‌లో తన ప్రయాణం కొనసాగుతుందని అన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జూడోయాత్ర దేశ రాజకీయాలన మార్చిందని అన్నారు. ఈ యాత్ర సామాజిక న్యాయానికి పునాది వేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రమాదం ఉందని తెలిసినా రాహుల్‌గాంధీ యాత్రను కొనసాగించడం చరిత్రాత్మకమని కొనియాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్న బియ్యం, రికార్డ్ స్థాయిలో రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయా ణం, 59వేల ఉద్యోగాలను ఇచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శిం చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే సోషల్ జస్టిస్‌కు కేరాఫ్ అని తెలిపారు. ధర్మపురి ప్రజల దీవెనలతో, కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతల ఆశీస్సులతో, సీఎం రేంత్‌రెడ్డి కృషితో నాకు అప్పగించిన మంత్రి పదవిని సమర్థవంతంగా నిర్వ హించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న మంత్రి సోమవారం ఉదయం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభతో ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీస్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రాధాబాయి శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

ప్రధాన సమస్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణ పేరుతో హడావుడి

- బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటాం
- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమ స్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేటీఆర్ విచారణ సందర్భంగా తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమని, బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటామని, మాపై బయటి వారు ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని ఆమె పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నవదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుం దన్నందుకే నోటీసులు, విచారణల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ఏ పార్టీలోనైనా లోపాలు ఉన్నప్పుడు అధినేతకు చెప్పుకోవడం సహజంగా జరుగుతుందన్నారు. చెప్పుకున్నంత మాత్రాన దాన్నేదో భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేదన్నారు.

వానాకాలం పంట సీజన్ మొదలైనప్పటికీ రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. హామీల అమలుపై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారణ చేసిందని, తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ విచారి స్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు వేధింపులకు భయపడే వాళ్లు కాదని.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారని వివరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగిత్యాల నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎంపీ దామోదర్ రావు ఎంపీ లాడ్స్ నుంచి రూ.90 లక్షలు కేటాయించారని, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మరో రూ.10 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జగిత్యాల, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్లు శీలం ప్రియాంక, ఉదయశ్రీ, నాయకులు మారంపల్లి రాణి, మహేశ్, సంధ్యారాణి, శారద, తుమ్మ గంగాధర్, బర్కము మల్లేశం, అనిల్, తేలు రాజు, గంగారెడ్డి, అనుధార, తిరుపతి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్, 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన ఎల్ఎల్ఎం ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని విరమించుకోవాలి

- మావోయిస్టుల పేరుతో ఆదివాసులను అంతం చేయడం సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సిరిసిల్లలో సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన నరమేధం విరమించుకోవాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాలుగవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి లహరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ తీశారు. లహరి ఫంక్షన్‌హాల్‌లో మహాసభల సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నాయ కురాలు అనసూర్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతలో భాగంగా దండకారుణ్యంలో ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో కలిసి నరమేధాన్ని సృష్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ మతవాద పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డమీద కరుడుగట్టిన ఆ పార్టీని అడుగు పెట్టనీయ కుండా ప్రజలందరం ఐక్యం కావాలన్నారు. గత పాలకులు అనేక భూఆక్రమణలకు పాల్పడి నిరుపేద భూములను తీసుకున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో వీలైన మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలన్నారు. దీనికి కోసం ఇప్పటినుంచే బలంగా ఉన్న ప్రాంతాలల్లో ప్రచారం చేపట్టాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద సుదర్శన్ నియమాకం

రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఇల్లంతకుంట మండలం వెంట్రావుపల్లె గ్రామానికి చెందిన మంద సుదర్శన్‌తో పాటు 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మాణాలను ఆమోదించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, మీసం లక్ష్మన్, పంతం రవి, ఎలిగేటి రాజశేఖర్, భూంపెల్లి భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అరుణోదయ కళా సంఘం గౌరవ అధ్యక్షురాలు విమలక్క డిమాండ్‌చేశారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేస్తుందని, కేంద్ర బలగాలతో అడవులను జల్లెడ పడుతూ ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను అదాని, అంబానీలకు దోచి పెట్టడానికి కుట్ర చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు 2026వరకు మావోయిస్టు పార్టీని అంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని, దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో 570మందిని హత్య చేశారని ఆరోపిం చారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని చౌరస్తా నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. విశ్వనాథ్, రత్న కుమార్, విజయ్‌కుమార్, ఆరెల్లి కృష్ణ, మాదన కుమారస్వామి, మాదాసు రామమూర్తి, ముడిమడుగుల మల్లన్న, తాండ్ర సదానందం, రాజన్న పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాలలో కొత్త కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీకాం(రిటైల్ ఆపరేషన్స్) అనే కొత్త డిగ్రీ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు టి.రాజయ్య, దోస్త్ కోఆర్డినేటర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కండక్టర్ లేకుండానే బస్సు తీసుకువెళ్లిన డ్రైవర్

కళ్యాణ్ నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కండక్టర్ లేకుండానే డ్రైవర్ బస్సును తీసుకువెళ్లిన ఘటన సోమవారం గోదావరిఖని బస్టాండ్‌లో చోటుచేసుకుంది. గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్02 జెడ్-0286 బస్టాండ్‌లో కరీంనగర్‌కు ప్రయాణికులను ఎక్కించుకున్నారు. కండక్టర్ లేకుండానే బస్సును డ్రైవర్ మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వరకు తీసుకు వెళ్లారు. కండక్టర్ లేదని ప్రయాణికులు చెప్పినప్పటికి వినకుండా బస్సును తీసుకు వెళ్లాడు. బస్సులో ప్రయాణికుడు ప్రవీణ్ డిపోమేనేజర్ నాగభూషణానికి ఫిర్యాదు చేశాడు. దీంతో డ్రైవర్ బస్సును తిరిగి బస్టాండ్‌కు తీసుకు వచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు దిగి మరో బస్సులో వెళ్లిపోయారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కండక్టర్ లేకుండా బస్సును తీసుకు వెళ్లాడని, తాము చెప్పిన వినలేదని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే వారి పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నించారు.

గుట్టల మట్టి మాయం..

- వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు



హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో గుట్ట వద్ద తవ్విన మట్టి

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని గుట్టల్లోని మట్టిని అక్రమార్కులు మాయం చేస్తున్నారు. పచ్చదనంతో కనబడే గుట్టలు నేడు బొందల గడ్డలుగా మారాయి. గుట్టలు ఉంటే చాలు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి, గణేష్‌నగర్, బోర్నపల్లి, ఎలబోతా



రం గ్రామాల్లో ప్రభుత్వ గుట్టలు మట్టితో నిండి ఉన్నాయి. వీటిపై కొంత మంది అక్రమార్కులు కన్నుపడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ గుట్టల నుంచి బహిరంగంగా ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తవ్వుతున్నారు. హుజూరాబాద్‌లో ఇటీవల ఇళ్ల నిర్మాణం బాగా పెరిగింది. దీనికి మట్టి అవసరం ఉండగా, పరిసరా ప్రాంతాల్లో దొరకడం లేదు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మట్టిని వ్యాపారం చేస్తున్నారు.

టిప్పర్ మట్టికి రూ. రెండు వేలు

హుజూరాబాద్‌లో టిప్పర్‌కు 1700 నుంచి రెండు వేల రూపాయల వరకు తీసుకుని మట్టిని తరలిస్తున్నారు. గతంలో పచ్చదనంతో కళకళలాడిన గుట్టలు ఇప్పుడు భారీ గుంతలుగా మారాయి. మట్టిని తరలిస్తున్నవారు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. గుట్టల నుంచి మట్టిని తరలిస్తుండడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి తరలి వస్తున్నాయి. గుట్టల నుంచి తీసుకొచ్చిన మట్టిని కొత్తపల్లి, గణేష్‌నగర్, రంగాపూర్ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తు న్నారు. అక్కడి నుంచి అవసరము న్న వారికి సర ఫరా చే స్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ దందాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బొందలగడ్డగా మారిన గుట్టలు

రాజేందర్, గ్రామస్థుడు, రంగాపూర్

ఒకప్పుడు పచ్చదనంతో ఉండే గుట్టలు నేడు బొందలగడ్డగా మారాయి. గుట్టల్లో నుంచి మట్టిని అక్రమంగా తోడేస్తున్నారు. నిత్యం వేలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి.

రక్తదాతలను అభినందించిన కలెక్టర్



ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మండలంలో ఎక్కుసార్లు రక్తదానం చేసిన దాతలను రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. దాతలు రంగాపూర్‌కు చెందిన సముద్రాల రాజ్‌కుమార్ గౌడ్, కోయ్యాడ శ్రీనివాస్ గౌడ్, రాఘవపూర్‌కు చెందిన కోడపత్రి శ్రావణ్, తాడిశెట్టి శ్రీకాంత్, మూలసాలకు చెందిన నాగుల మల్లేశంకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంస పత్రం అందజేశారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ఇరవైరెండు సార్లు రక్తదానం చేసిన గోదావరిఖనికి చెందిన ఈదునూరి శంకర్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ కోయ శ్రీహర్ష అవార్డు, ప్రశంసపత్రాన్ని అందజేశారు. సొసైటీ సభ్యులు వెంకటేశం, రాజగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఈవోకు నోటీసులు

ఓదెల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ఈవో సదయ్యకు ఆర్టీఐ కమిషనర్ నుంచి నోటీసులు అందాయి. 2020 సెప్టెంబరు 17న ఓదెలకు చెందిన నాగపురి రవిగౌడ్ దేవస్థానం ఆదాయ, వ్యయాలపై ఆర్టీఐ కింద దరఖాస్తు అందించారు. ఐదేళ్లు కావస్తున్నా ఈవో సమాచారం ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుడు రాష్ట్ర కమిషనర్‌ను ఆశ్రయించాడు. పరిశీలించిన కమిషనర్ ఈనెల 23న హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు పంపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

పెద్దపల్లి రూరల్/ఎలిగేడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 18న పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సురేంద్రకుమార్, అనసూరి సురేంద్రచారిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి ఎంపిక పోటీలు 18న జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానం, ఎలిగేడు జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం ఫిజికల్ డైరెక్టర్‌లు వేల్పుల సురేందర్, శైలజ, శ్రీధర్, ఎంఈవోలను సంప్రదించాలని సూచించారు.

'అనుబంధాలు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై లక్ష్మణ్

ధర్మారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నర్సింహులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి మల్లె వెంకట సుప్రజ, తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ ప్రోత్సాహంతో రచించిన 'అనుబంధాలు' పుస్తకాన్ని సోమవారం ఎస్సై లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను చూస్తే సంతోషంగా ఉందని, తాను చదివిన రోజులు గుర్తుకొచ్చాయన్నారు. విద్యార్థిని సుప్రజ చిన్న వయసులో పుస్తకం రాయడం హర్షనీయమన్నారు. అనంతరం పుస్తకంలో కుటుంబ అనుబంధాలు, చెట్లు, పూలు, ప్రకృతి, సెల్‌ఫోన్‌పై రచనలను పరిచయకర్త అడిచర్ల సతీష్ వివరించారు. అంతకుముందు విద్యార్థులకు ఎస్సై పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఎస్సైని ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ధనుష్, మణికంఠ ఎంపికయ్యారు. ఈనెల 14న గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గోల్, సిల్వర్ మెడల్స్ అందుకున్నట్లు పీఈటీ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ఐపీఎస్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు.

రూరల్ ఎస్‌ఐని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

పెద్దపల్లి రూరల్ , జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండల రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మల్లేష్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌ఐ మల్లేష్‌కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్, మండల అధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఓదెల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు తిరుమలేష్, పెద్దపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరగొండ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను నానేస్తం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సన్మానించారు. సత్యనారాయణ, సుధాకర్‌రావు, మల్లారెడ్డి, డిల్లేశ్వర్‌రెడ్డి, సత్యం, వీరస్వామి, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళి

పెద్దపల్లిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మరణించిన వారికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విమాన ప్రమాదంలో 270 మంది మరణించగా వారి కుటుంబాలకు శాంతి చేకూరాలని మౌనం పాటించినట్లు తెలిపారు. విమానంలో ఉన్న వారే కాకుండా మెడికోలు కూడా దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ్, సత్యనారాయణ, కట్ట చంద్రమౌళి, వెంకన్న , దిలీప్, ప్రసాదు, తిరుమల్, పిట్ట రమేష్ లింగమూర్తి పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలనీ షిర్కే ఏరియా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్‌గా ఆరెల్లి విజయ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా కుమ్మరి సదానందం, వైస్ ప్రెసిడెంట్‌గా యాదగిరి సతీష్, కోశాధికారిగా సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో సీనియర్ డ్రైవర్లు జనగామ రవీందర్‌రావు, రమేష్, బోయిని రమేష్, ఎండీ అంకుష్, తిరుపతి పాల్గొన్నారు.

రైతులందరికీ 'భరోసా'

- రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన అధికారులు, రైతులు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, అధికారులు

సుల్తానాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రైతులందరికీ సోమవారం నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సహాయం డబ్బులు ఖాతాలలో జమ అవుతాయని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతునేస్తంలో భాగంగా కనుకుల రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. సీఎం సందేశాన్ని ఎమ్మెల్యే, రైతులు, అధికారులు తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు పంటల పెట్టుబడి సహాయం కింద ఎకరానికి ఆరు వేల చొప్పున రైతుల ఖాతాలలో జమ చేస్తున్నామని, తొమ్మిది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి మాట్లాడుతు జిల్లాలోని 54 క్లస్టర్‌లకుగాను 38 చోట్ల రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించామన్నారు. రైతుభరోసా కింద ఈనెల 5 వరకు కొత్తగా పట్టాదార్ పాస్ బుక్‌లు, డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్‌లతో ఈ నెల 20లోగా రైతువేదికలలో సమర్పించాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, తహసీల్దార్ బషీరొద్దిన్, మాజీ సర్పంచ్ పోలు అంజయ్య, మీస సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, దామోదర్‌రావు, చిలుక సతీష్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు రైతులతో కలిసి వీక్షించారు. సీఎం మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ అమలు చేస్తోందన్నారు. రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీవో వేణుమాధవ్, వ్యవసాయ శాఖ అధికారి సతీష్, రైతులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ముత్తారం, మైదంబండ, ఖమ్మంపల్లి రైతువేదికలో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం రైతులతో నిర్వహించారు. మైదబండ, ఖమ్మంపల్లి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి అనూష, ఎంపీడీఓ సురేష్, ఎమ్మార్వో మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదగి రిరావు, ఏఈవోలు మనీషా, హారిక శ్రీలేఖ, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ రైతువేదికలో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప రైతులతో పాల్గొని ముఖ్యమంత్రి సందేశాలను తిలకించారు. మండల వ్యవసాయాధికారి అలివేణి, పీఏసీఎస్ చైర్మన్ మాదిరెడ్డి నరసింహరెడ్డి అధికారులు పాల్గొన్నారు. కొత్తపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ రైతువేదికల్లో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. సీఎం వీసీలో రైతు భరోసా విడుదల కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.ఆర్డీవో సురేష్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీఈఆర్‌సీ సభ్యుడు శశిభూషణ్ కాచే, ఏడీఏ అంజనీ, మాజీ జెడ్పీటీసీ సరోజన, రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట రైతువేదికలలో రైతులు వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్ రెడ్డి, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ భాస్కర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఉద్యానవన అధికారి మహేష్, ఏపీఎం సుధాకర్, ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ధర్మారం, దొంగతుర్తి, కటికెనపల్లి రైతువేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు, అధికారులు వీక్షించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏడిఏ శ్రీనివాస్, డిటి ఉదయ్ కుమార్, ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, ఏఓ అఖిల, ఏఎంసీ-ప్యాక్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఏవో నాగార్జున మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్, అబ్బాపూర్, తెలికుంట రైతువేదికల్లో రైతుభరోసా నిధుల విడుదలపై హర్షం వ్యక్తంచేశారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు వీక్షించారు. ఏఈఓలు రాకేష్, కిరణ్మయి, మార్కెట్ చైర్మెన్ గండు సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట్‌లో రెవెన్యూ సదస్సు

రామగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబ్‌పేట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వెల్లల్‌పహడ్ రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన సదస్సుకు తహసీల్దార్ సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులఁ నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 18 మంది రైతులు ఆర్జీ పెట్టుకున్నారు. డీటీ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం

ధర్మారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పైడిచింతలపల్లిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు పెన్సిళ్లు, టై బెల్టులు అందజేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారెడ్డి అన్నారు.

లయన్స్‌క్లబ్ మహిళా కార్యవర్గం

కళ్యాణ్‌నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ రామగుండం మగువ అధ్యక్షురాలిగా పోగుల వకుళ, కార్యదర్శిగా ఆడెపు ఉష, కోశాధికారిగా మంజులను నియమించినట్లు లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం గోదావరిఖనిలోని లయన్స్‌క్లబ్‌లో ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ సభ్యులుగాలిపెల్లి వెంకట్, కంజపురం రాజేందర్, గాలి సునీత, మంజుల, వరలక్ష్మి పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోండి

కళ్యాణ్‌నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సూపర్‌వైజర్ తాజ్ మానసికంగా వేధిస్తున్నారంటూ నర్సింగ్ సిబ్బంది సోమవారం మెడికల్ సూపరిండెంట్ దయాల్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. తాము పని చేయడం లేదని ఫొటోలు తీసి కలెక్టర్‌కు పంపుతానని బెదిరిస్తున్నాడని సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని నర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన డీఈ



రోడ్డు పనులను పర్యవేక్షిసున్నా డిఈ(పిఆర్)నవీన్

రామగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో రూ.1.60 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం పంచాయతీరాజ్ డీఈ నవీన్ పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇరుపక్కల కట్టడాలను తొలగించి పనులు చేపట్టాలని, పనుల్లో పారదర్శకతను పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకే జరుగుతున్నా పనుల్లో ఒక పక్క తొలగించి మరో పక్క తొలగించకుండా ఉండడాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరి ఆదేశాలు పాటించాల్సిన అవసరం లేదని జవాబుదారితనం, నిబంధనల మేరకే నడుచుకోవాలన్నారు. తొలగించకుండా ఉన్న కుటుంబ యాజమానులకు నోటీసులు జారీ చేసి కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. రోడ్డు పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సెక్రటరీ శ్రీధర్, కారోబార్‌లు కనకయ్య, శ్రావణ్ ఉన్నారు.

ఖనిలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట

కళ్యాణ్‌నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ సోమవారం సీపీడీవో అలేఖ్య ఆధ్వర్యంలో గోదావరిఖని మార్కండేయకాలనీలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, సీమంతాలు, అన్నప్రాసనలు చేశారు. ఆమె మాటాడుతూ తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలలలో చేర్పించాలని, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. సూపర్‌వైజర్ జమున పాల్గొన్నారు. జనగామ-2 సెక్టార్‌లో సూపర్‌వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజలక్ష్మి, మంజుల, సరోజ, రాజేశ్వరి, లక్ష్మీ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో టీచర్ల భర్తీకి ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల మోడల్ స్కూల్‌లో హవర్లీ బేసిక్‌పై ఉపాధ్యాయులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య తెలిపారు. మ్యాథమెటిక్స్, తెలుగు, ఇంగ్లీష్ బోధించుటకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోస్ట్ గ్రాడ్యూయేషన్‌తోపాటు బీఈడీ ఉండాలన్నారు. ఈనెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21న డెమో తరగతులు నిర్వహిస్తామని, ఈ డెమో క్లాస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి బయోడేటా, అర్హత జిరాక్స్, ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని ఆయుష్ డాక్టర్ నిహారిక అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా వేడుకల్లో భాగంగా బాలబాలికలకు యోగా క్లాస్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజు యోగా చేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. మానసికంగా ఏకాగ్రత పెరిగి చదువులో ముందుంటారన్నారు. పిల్లలతోపాటు పెద్దలు యోగాచేయాలన్నారు. పాఠశాల హెచ్ఎం సునీత, పీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, హెచ్ఈఓ శ్రీనివాస్, వినీత్, ఏఎన్ఎం సరుజన, ఆశాలు మౌనిక, సరోజన, శారద తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువలో 'రైతునేస్తం'

(5వ పేజీ తరువాయి)

గ్రామాలకు చెందిన రైతులకు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించే సమాచారాన్ని ముందస్తుగానే ఏఈవోలు అందిస్తారు. పంటలకు సంబంధించే కాకుండా, పశువులు, గొర్రెలు, మేకల పెంపకం గురించి, కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ సాగు గురించి, చేపల పెంపకం గురించి కూడా అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందించనున్నారు. శిక్షణ తరగతులకు కూడా వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను సద్వినియోగం చేసుకోనున్నారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రులు కూడా వీటి ద్వారా రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు రైతులకు ఎంతగానో ఉపయోగ పడనున్నాయని, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని వివిధ పంటల సాగులో అధిక దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి రైతులను కోరారు.

గుడిలో నాగుపాము



ఆలయంలో ఉన్న నాగుపాము

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో గుట్టల మధ్య వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. దాని పక్కనే శివాలయం ఉంది. ఈ రెండు ఆలయాల్లో గర్రెపల్లికి చెందిన శ్రీనివాసచారి పూజలు చేస్తుంటారు. సోమవారం ఉదయం గుడికి వచ్చి చూడగా ఎదురుగా దాదాపు మూడు మీటర్ల పొడవు గల నాగుపాము శివాలయం ఎదుట అగుపించింది. కొంత సమయం గడిచినా నాగుపాము అక్కడి నుంచి వెళ్ళలేదు. దీంతో పూజారి సమీప గ్రామస్థులకు సమాచారం ఇవ్వగా వారు ఆలయానికి రావడంతో అలికిడితో పాము అక్కడి నుంచి వెళ్ళిపోయింది. అనంతరం పూజారి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఓడేడు గ్రామపంచాయతీని సందర్శించిన డీపీవో



సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో

ముత్తారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే శీర్షికకు సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డీపీవో వీరబుచ్చయ్య ఓడేడు గ్రామపంచాయతీని సందర్శించారు. ఆయన మురికి కాలువలు, సెగ్రిగేషన్ షెడ్డు, గ్రామాల్లోని రోడ్లు పరిశీలించారు. మురికి కాలువలు రోడ్లపై చెత్తాచెదారం ఉండకూడదని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, షెడ్‌లో ప్రకృతి ఎరువును తయారు చేయాలని, వర్షాకాలంలో నీరు నిలువ ఉండకుండా చూడాలని కార్యదర్శికి సూచించారు. ఎంపీడీవో సురేష్, కార్యదర్శి రాజేందర్‌లు పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణ పనుల్లో వేగం పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో పనులను వేగవంతం చేయాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అధికారులను ఆదేశించారు. సోలార్, పవన, జియో, థర్మల్ విద్యుత్, బొగ్గు నుంచి కెమికల్స్ ఉత్పత్తి ప్రాజెక్టులపై సోమవారం వీడి యోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు మందకొడిగా కొనసాగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. 28 రకాల ప్రాజెక్టులు, పనులపై సీఎండీ అధికారులతో చర్చించారు. పదిరోజుల్లో ప్రతీ పనిలో పురోగతి కనిపించాలన్నారు. బొగ్గు ఉత్పత్తితోపాటు వ్యాపార విస్తరణపై ప్రతీ వారం సమీక్ష నిర్వహిం చనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయాలు, క్వార్టర్లపై రూఫ్ టాప్ సోలార్ పవర్ ఏర్పాటు, కోల్ వాషరీలు, హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు అంశాలపై చర్చించారు. డైరెక్టర్లు సత్యనారాయణ రావు (ఈఅండ్ఎం), వెంకటేశ్వర్లు (పీపీ), గౌతం పొట్రు (పర్సనల్), ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్‌మూవ్ మెంట్‌ఎస్ డీఎం సుభాని, జీఎం (సీపీపీ) మనోహర్, జీఎం (మార్కెటింగ్) రాజశేఖరరావు థర్మల్ పవర్, సోలార్, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్, సివిల్, బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగాల జీఎంలు పాల్గొన్నారు.

ఆర్జీ-1 పర్సనల్ డిపార్ట్‌మెంట్ సమీక్షా సమావేశం

గోదావరిఖని, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 పర్సనల్ డిపార్ట్‌మెంట్ అంశాలపై సోమవారం డీజీఎం పర్సనల్ ముప్పిడి రవీందర్‌రెడ్డి ఏరియాకు చెందిన వెల్ఫేర్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్జీ-1 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తూ గైర్హాజరు అవుతున్న ఉద్యోగుల వివరాలు, సీఎంపీఎఫ్ నామినేషన్ల పెండింగ్, కారుణ్య నియామక ఉద్యోగాలు, టర్మినల్ బెన్‌ఫిట్స్ చెల్లింపులపై సమీక్షించారు. హాజరు శాతం పెంచడంలో భాగంగా గైర్హాజరీ ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సకాలంలో వారికి చెల్లించే ఆర్థిక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. సీనియర్ పీవోలు శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఓసీపీ-3లో హైడ్రాలిక్ క్రేన్ ప్రారంభం



హైడ్రాలిక్ క్రేన్‌ను ప్రారంభిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో హైడ్రాలిక్ క్రేన్‌ను షావల్ సెక్షన్‌లో సోమవారం ఏరియా జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ ప్రాజెక్టు అవసరాల నిమిత్తం రూ.4.41 కోట్లు వెచ్చించి 75 టన్నుల సామర్థ్యం ఉన్న హైడ్రాలిక్ క్రేన్‌ను కొనుగోలు చేసినట్టు తెలిపారు. మెరుగైన ఉత్పత్తి సాధించడానికి క్రేన్ ఉపయోగపడుతుందన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారు సంఘం ఏరియా అధ్యక్షుడు, ఎస్వోటూ జీఎం రాముడు, పీఓ ఉదయ్ హరిజన్, మేనేజర్ భరత్‌కుమార్, సేఫ్టీ అధికారి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వీకేపీ గనిని సందర్శించిన జీఎం సేఫ్టీ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిని సోమవారం ఆర్జీ రీజియన్ సేఫ్టీ మధుసూదన్ సందర్శించారు. సర్వే ప్లాన్ ద్వారా గనిలో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గనిలోకి దిగి కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలను తనిఖీ చేశారు. సేఫ్టీ జీఎం వెంట ఏజంట్ నెహ్రూ, ఏరియా సేఫ్టీ అధికారి సంతోష్‌కుమార్, గని మేనేజర్ రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, సర్వే అధికారి రహ్మత్‌అలీ ఉన్నారు.

ఆర్జీ-2లో యోగా క్యాంప్‌లు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో జీఎం బండి వెంకటయ్య ఉద్యోగులతో కలిసి యోగా సాధన చేశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సోమవారం నుంచి 20వ తేదీ వరకు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై యోగా శిక్షణ క్యాంపులు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై యాజమాన్యంతో చర్చించండి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అధికారుల అపరిష్కృత సమస్యలపై యాజమాన్యంతో చర్చించాలని ఆర్జీ-1 అధికారుల సంఘం జీఎం లలిత్‌కుమార్‌ను కోరింది. సోమవారం పెండింగ్ సమస్యలపై జీఎంను కలిసిన సీఎంవోఏఐ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం సమస్యలపై స్పందించకుంటే ఈనెల 24న నల్లబ్యాడ్జీలతో నిరసన, జులై 1 నుంచి రిలే దీక్షలు, జులై 7న వర్క్‌టు రూల్ వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్జీ-2 సీఎంఓఏఐ ప్రెసిడెంట్ మల్లేశం, జనరల్ సెక్రెటరీ కోలా మల్లేశం ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై జీఎం బండి వెంకటయ్యకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తున్నదన్నారు. సంఘం ఆర్జీ-2 ప్రెసిడెంట్ రాముడు, సెక్రెటరీ సంజీవ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ నరేష్, సభ్యులు జనార్దన్, రామకృష్ణ, నితిన్, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

రామగిరి: సింగరేణిలో పనిచేసే అధికారుల పర్ఫామెన్స్ రిలేటడ్ పే (పీఆర్‌పీ) జాప్యంపై ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లో అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకట రమణ ఆధ్వర్యంలో జీఎం నాగేశ్వర్ రావుకు అధికారులు వినతిపత్రం అందజేశారు. ఏడేళ్లుగా పీఆర్‌పీ జాప్యం చేస్తున్నారని నల్లబ్యాడ్జిలను ధరించారు. సీఎండీ స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-3, ఏపీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.